అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 17 మార్చి 2023 పేజీలు : 04

## ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న
# ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- మొదటి ప్రాధాన్యతలో తేలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం - కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్
- కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఎన్నికల పరిశీలకులు - భారీ భద్రత ఏర్పాట్లు












**అనంతపురం సిటీ, మార్చి 16 ప్రభాతవార్త**
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌ను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచిన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు చేర్చారు. తొలుత ఎన్నికల సమయంలో నమోదైన ఓటింగ్‌కు బ్యాలెట్ బాక్సులలో ఉన్న ఓట్లను సరి చూసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అయితే పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఒక బాక్సులో ఎక్కువగాను, రెండు బాక్సులలో తక్కువగాను ఓట్లు ఉన్నట్లు గుర్తించడంతో కొంత వివాదం తలెత్తగా ఎన్నికల అధికారులు సర్ది చెప్పడంతో సమస్య సర్దుమనిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రారంభించి 12 టేబుళ్లను ఏర్పాటు చేసి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఇందులో వైసీపీ బలపర్చిన అభ్యర్థిరామచంద్రారెడ్డికి 8846 ఓట్లు వచ్చి ప్రథమ స్థానంలో నిలవగా, ఒంటేరు శ్రీనివాసరెడ్డికి 6,853 ఓట్లు రాగా ఎవరికీ 50 శాతం పైబడిన ఓట్లు రాకపోవడంతో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. రాత్రి 10 గంటల వరకు ఎవరికీ పూర్తి మెజార్టీ రాకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అదే విధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో బ్యాలెట్ బాక్సులలో ఓట్లు సరిచూసే ప్రక్రియ గురువారం సాయంత్రం వరకు కొనసాగగా సాయంత్రం 6గంటలకు 24 టేబుళ్లను ఏర్పాటు చేసి మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభించగా రాత్రి 10 గంటల వరకు లెక్కిస్తున్నా మొదటి రౌండ్ పూర్తి కాలేదు. ఉత్కంఠ భరితంగా ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం గురువారం అర్ధరాత్రికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం శుక్రవారం రాత్రికికానీ, శనివారం కానీ వెల్లడయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగించేందుకై మూడు షిఫ్టులను సిబ్బంది అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. బరిలో నిలిచిన అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాలలోనే ఉండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్నారు. అదే విధంగా ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, హరి జవహర్‌లాల్, జిల్లా కలెక్టర్‌నాగలక్ష్మిలు సైతం ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా జిల్లా ఎస్పీ పక్కీరప్ప కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ చేపడుతూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియలో ఓటర్లు ఎవరికి మొగ్గు చూపారన్నది మొదటి ప్రాధాన్యత ఓటులో తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఉపాధ్యాయుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 608 చెల్లని ఓట్లు నమోదు కావడంతో ఉపాధ్యాయులకు అవగాహన లేక వేశారా.. ఉద్దేశ్య పూర్వకంగా వేశారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

## టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి హోరా హోరి పోటీ

- గెలుపు బాటలో వైసిపి అభ్యర్థి రామచంద్రారెడ్డి - రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసరెడ్డి - ఓటమి బాటలో పిడిఎఫ్ అభ్యర్థి

**అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో**
పశ్చిమ రాయలసీమ టీచర్స్ శాసనమండలి స్థానానికి జరిగిన ఎన్నికల్లో వైసీపి అభ్యర్థి రామచంద్రారెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డిల మధ్య నువ్వా నేనా అన్న రీతిలో హోరాహోరి సాగింది.


రామచంద్రారెడ్డి


ఒంటేరు శ్రీనివాసరెడ్డి

ఓట్ల లెక్కింపు ఫలితాల ప్రకారం విజయం దిశగా వైసీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి దూసుకు పోతున్నాడు. రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసరెడ్డి నిలిచారు. చివరి వరకు ఓట్ల లెక్కింపు జరిగితే వీరిద్దరి మధ్య పోటీ జరిగి కొద్ది ఓట్ల తేడాతో ఏమైనా జరగే అవకాశం ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. వైసిపి అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలిచే అవకాశం ఉందని ఆయనకు వచ్చిన ఓట్లను ఎవరు అధిగమించే అవకాశం లేదని తక్కువ ఓట్లతోనైనా వైసీపీ అభ్యర్థి గెలుస్తాడని చెబుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి ఓటమి దిశలో పయనిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి రెండో రౌండ్ ముగిసే సమయానికి 8846 ఓట్లు వచ్చాయి. ఆయనకు మొదటి రౌండ్‌లో 4756 రాగా, రెండో రౌండ్‌లో 4090 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డికి రెండు రౌండ్లలో 6853 ఓట్లు వచ్చాయి. అంటే దాదాపు 2వేల ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి రామచంద్రారెడ్డి ఉన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి రెండు రౌండ్లు కలిపి 4162 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు అనంతపురం జెఎన్‌టియు కళాశాలలో గురువారం ఉదయం నుంచి కొనసాగుతోంది. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కించడం పూర్తి అయినప్పటికీ గెలిచే అభ్యర్థికి అవసరమైన మెజార్టీ రాలేదు. ఈ పరిస్థితుల్లో రెండో ప్రాధాన్యత, మూడో ప్రాధాన్యత ఓట్లు లెక్కించుకుంటూ పోతున్నారు. ఎలిమినేషన్ చేస్తూ వెళ్తున్నారు. తుది ఫలితాలు అర్ధరాత్రి అయ్యే అవకాశం ఉంది.

## ఆధునిక శిబిచక్రవర్తి పొట్టి శ్రీరాములు

-జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**పుట్టపర్తిరూరల్, మార్చి 16, ప్రభాతవార్త**
అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్పత్యాగమూర్తి అని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు, మహనీయుడు అని ఆధునిక శిబిచక్రవర్తిగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ కొనియాడారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నందు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించి, 15 డిసెంబర్ 1952లో అమరులయ్యాయన్నారు. తెలుగు ప్రజల కొరకు భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని ఏర్పరచాలని 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారని, ఆయన త్యాగ ఫలితంగానే 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. పొట్టి ఎరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని, 1941-42 కాలంలో సత్యగ్రహాలు, క్వింట్ ఇండియా ఉద్యమంలో పాల్గొడం వల్ల మూడు సార్లు జైలు శిక్ష అనుభవించారన్నారు. ఈ మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిందని, నెల్లూరు జిల్లా పేరును 2008లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చరని అమరజీవి పొట్టి శ్రీరాములు గారి గౌరవార్థం తపాల శాఖ వారు 2000 మార్చి 16న ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేశారన్నారు. మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాల నుండి స్పూర్తి పొంది యువత సన్మార్గంలో దేశభక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి ప్రతాప్ కలెక్టరేట్ కార్యాలయం ఎఓ వెంకటనారాయణ, తహశీల్దార్ అనుపమ, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఇతర సెక్షన్ సూపరింటెండెంట్లు, తదితరలు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్


రాష్ట్రపతికి నమస్కరిస్తున్న ఎంపి తలారి రంగయ్య

## రాష్ట్రపతిని కలిసిన ఎంపి తారిరంగయ్య

**అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో**
న్యూఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రాష్ట్ర పతి భవన్‌లో ఇచ్చిన అల్పాఆర విందు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీష్‌ధన్‌కర్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, వైకాపా పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, వైఎస్ఆర్‌సిపి లోక్‌సభ పక్షనేత మిథున్‌రెడ్డి, సహచర ఎంపిలతో కలిసి అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య పాల్గొన్నారు.

## మొదటి రౌండ్‌లో వెన్నపూస రవీంద్రారెడ్డికి 827 ఓట్ల మెజారిటీ

**అనంతపురం మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో**
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపులో తొలి రౌండు పూర్తయింది. వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి 9664 ఓట్లు, టిడిపి అభ్యర్థి రామ్‌గోపాల్‌రెడ్డికి 8837 ఓట్లు, పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజుకు 1735 ఓట్లు, బిజెపి అభ్యర్థికి 741 ఓట్లు వచ్చాయి. తొలి రౌండులో వైసిపి అభ్యర్థి రవీంద్రారెడ్డికి 827 ఓట్ల మెజారిటీ వచ్చింది.



## పుష్పయాగోత్సవంతో ముగిసిన కదిరి ఖాదీశ్రుని బహ్మోత్సవాలు


పుష్పయాగోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేతుడైన ఖాద్రీశుడు


పలురకాల పుష్పాలతో స్వామివారికి పూజలు


గోమాత ప్రవేశంతో ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు


ప్రధాన ద్వారం వద్ద హోమంతో ఆలయ సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

# త్యాగశీలి మన అమరజీవి



పరీక్ష అట్టల అందుకున్న విద్యార్థినిలు



జామెట్రీ పెట్టెలతో విద్యార్థులు

**డి.హిరేహాళ్ మార్చి 16 ప్రభాతవార్త :** ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు 52 రోజులు ఆమరణ నిరాహారదీక్షచేసి తన ప్రాణత్యాగంచేసిన మన అమరజీవి పొట్టి శ్రీరాములు కు మనం ఎంతో రుణపడి ఉన్నామని ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యా యుడు శంకర్ గౌడ్ తెలిపారు. గురువారం డి.హిరేహాళ్ మండలం హొసగుడం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్.ఎం. ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యాకమిటి ఛైర్మెన్ ఉమేష్, విద్యార్థులు ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటంకు పూలమాలలు నివాళులు అర్పించి 123వ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మెచ్.ఎం. మాట్లాడుతూ మన అమరజీవి నిస్వార్థంగా ప్రపంచంలోనే ఎవరూ చేయని త్యాగం ఆంధ్ర ప్రజలకోసం తన జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తని ఆయన సేవలను కొనియాడారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని గుత్తి పట్టణంకు చెందిన శ్రీలక్ష్మీబాలాజీ మెడికల్‌స్టోర్ యజమాని గోపాల్ 6 వ, 8 వ తరగతి విద్యార్థులకు అట్టలు, జామెట్రీబాక్సులు, పెన్నులు వితరణ చేశారు. నాగలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్‌బాబు ఆ పాఠశాల విద్యార్థులకు 6 వ తరగతి నుండి 9 వ తరగతి విద్యార్థులకు పెన్నులు, 9వ తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. నాగలాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ళు, మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, శ్రీదేవి, అశ్వర్థప్ప, వాణిశ్రీ, పార్వతి, వరలక్ష్మి, విజయశాంతి, గీత, తలారి రాజప్ప, శ్రీనివాసులు, రాము, సురేష్, వెంకటకృష్ణ, షాహినా, రమేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# వన్నూరుస్వామి దర్గాలో వైభవంగా ఖిలాఫత్ (పీఠాధిపత్యం)



శిష్యరికం స్వీకరించిన భక్తులు

**బొమ్మనహాళ్, మార్చి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఎలిసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన వన్నూరుస్వామి (హజరత్ సూఫిసర్మస్త్ వలి చిష్తి ర.హ) సన్నిధిలో గురువారం ఖిలాఫత్ (పీఠాధిపత్యం) కార్యక్రమం నిర్వహించారు. దర్గాహొన్నూరు దర్గాకు వంశ పారపర్యపు 8వ పీఠాధిపతి అయిన హజరత్ సయ్యద్‌షా రహమతుల్లా బాద్‌షా హుసేని చిష్తి సదర్స్‌జ్దానజీన్, ముతవల్లి అయినటువంటి వారు తన రెండవ కుమారుడు అయిన హజ్రత్ సయ్యద్ షా ఖాజా పీరీ బాద్‌షా హుసేని చిష్తివారికి పీఠాధిపత్యంతో దర్గా ఆవరణలో సత్కరించి గురుభోదన ఇవ్వడం జరిగింది.

# ఆర్‌డిటి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



ఫాదర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**కుందుర్పి, మార్చి 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఊరు మొత్తం ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్‌ఫెర్రర్ గుడి దగ్గరకు వెళ్లి ఫాదర్ విగ్రహానికి పూలమాలను వేసి, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫాదర్ గుడిదగ్గరకు వెళ్లి ఫాదర్ విగ్రహానికి పూలమాలను వేసి, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫ్యాదర్‌ని స్మరించుకుంటూ వారు చేసిన ఎన్నో మంచి పనులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ కుందుర్పి మండలంలోని ప్రతి ఎస్సీ ఒక్కొ మహిళకు సంవత్సరానికి 4వేల రూపాయల చొప్పున 7 సంవత్సరాలపాటు 260 మంది మహిళల ఖాతాలకు డిపాజిట్ చేశారు. ఇలా డిపాజిట్ చేసిన మొత్తం 260 మంది మహిళలకు గాను 91 లక్షలు అయింది. ఈ మొత్తాన్ని వారి స్వయంఉపాధి కోసం ప్రోత్సాహకంగా ఒక్కొక్కమహిళకు 30వేల నుంచి 35వేల రూపాయలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి లక్ష్మణరావు ఎటిఎల్ జయరాంరెడ్డి, ఎస్‌టిఎల్ బాలయ్య, ఆర్డీటి సిబ్బంది పాల్గొన్నారు.

# జొన్నసొప్ప, వేరుశనగ కట్టె అగ్నికి ఆహుతి

- 70వేలు ఆస్థినష్టం.. బోరు మంటున్న రైతులు



అగ్నిని ఆర్పుతున్న రైతులు

**బొమ్మనహాళ్, మార్చి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దర్గాహొన్నూరు పంచాయితీలోగల వన్నల్లి పంచాయితీలో నివాసం ఉంటున్న వన్నారెడ్డి, నరసింహులు అనే రైతులకు సంబంధించిన జొన్న సొప్ప వేరుశనగ కట్టె గురువారం అగ్నికి ఆహుతై 70వేలు నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. వివరాల మేర కు.. నరసింహులు, వన్నారెడ్డి ఇద్దరు రైతులకు సంబంధించిన 30 ఎకరాల జొన్న సొప్ప, వేరుశనగ కట్టె గ్రామ శివారులో వారికి సంబంధించిన దొడ్డిలో నిల్వ ఉంచారు. కొందరు ఆకతాయి వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడి దైందని, మంటలు ఆర్పడానికి గ్రామస్తులతోపాటు ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించినప్పటికీ అదుపు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మూగ జీవాలకు మేత లేకుంటే ఎలా బ్రతకాలని, మనుషులు అయితే గ్రామాలను వదిలి ఇతర గ్రామాలకు వెళ్తారని అవి ఎక్కడికి వెళ్తాయని, ప్రభుత్వం గుర్తించి రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. సంబంధిత విఆర్‌ఓ రామన్న సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపుతున్నట్లు విఆర్‌ఓ తెలిపారు.

# 27 మంది జూదరుల అరెస్ట్



పట్టుబడిన జూదరులను చూపుతున్న దృశ్యం

**హిందూపురం టౌన్, మార్చి 16 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు హిందూపురం ఒకటవ పట్టణ సిఐ ఈరన్న సిబ్బందితో కలిసి దాడులు జరిపి 27 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 80 వేల 500 రూపాయల నగదు, ఆరు మోటర్‌సైకిళ్ల, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్ల సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ ఈరన్న మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మహిళ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ

**హిందూపురం, మార్చి 16 ప్రభాతవార్త :** హిందూపురం రూరల్ కొటిపి పంచాయతీ బసవేశ్వరకాలనీలో నివాసం వుంటున్న సరస్వతి (35) అనే మహిళ బుధవారం హత్యకు గురైంది. అప్‌గ్రేడ్ సిఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సరస్వతి కర్నాటక రాష్ట్రం ఇదేబిదనూరుకు చెందిన అజీం అనే వ్యక్తితో గత కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఇద్దరి మధ్య నగదు విషయమై ఘర్షణ జరిగింది. కాగా అజీం సరస్వతిని గొంతు నులిమి హత్య చేసినట్లు సిఐ తెలిపారు. మృతురాలి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# రైతులు పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

- పిఎసిఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప చౌదరి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షులు తిమ్మప్పచౌదరి

**కణేకల్లు, మార్చి 16 ప్రభాతవార్త :** మండల కేంద్రం రాంనగర్‌లో గురువారం పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని పిఎసీఎస్ అధ్యక్షులు పై నేటి తిమ్మప్పచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పప్పుశనగ పండించే రైతులు దళారుల చేతులో మోస పోకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు కృషి చేశారన్నారు. రైతులు పప్పు శనగ పంట పండించిన పప్పుశనగ విత్తనాలకు కు క్వింటాకు కనీస మద్దతు ధర : 5335 లు నిర్ణయించడం జరిగిందన్నారు. పప్పు శనగ విత్తనాల బయట బహిరంగ మార్కెట్ లో కంటే ప్రభుత వ్ం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసుకోవడం జరుగుతుందన్నారు. కావునా రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కనేకల్ పిఎసిఎస్ సీఈవో హనుమంతు, ఎంపిఈఓ లాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి 41వేల ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

**అగళి, మార్చి 16 ప్రభాతవార్త :** ఇటీవల మధూడిన వీఎం లోని సువర్ణముఖి నది నీటిలో ఈతకు వెళ్లి లోకేష్ అనే 10వ తరగతి విద్యార్థి మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. లోకేష్ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించాలన్న ఉద్దేశ్యంతో ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప, ఉపాధ్యాయ బృందం అంతా కలిసి 41,500 రూపాయలను జమా చేసి మృతి చెందిన లోకేష్ విద్యార్థి తల్లికి అందజేసి ఉపాధ్యాయులు మానవత్వాన్ని చాటుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు.

# తడి పొడి చెత్తపై అవగాహన

- స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ సునీత



ఇరిగేపల్లిలో తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**అగళి, మార్చి 16 ప్రభాత వార్త :** మండల పరిధిలోని ఇరిగేపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ భారత్ కమిషన్ కోఆర్డినేటర్ సునీత ఆనందలు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. వాటిని వేరు చేసి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడ తయారయ్యే ఎరువును అమ్మి ఆ డబ్బులతో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలన్నారు. ఒక పక్క పంచాయితీ వీధుల శుభ్రత, మరోపక్క గ్రీన్ అంబాసిడర్ల జీతాలు దీని నుంచి వస్తాయన్నారు. మరుగుదొడ్లపై సర్వే నిర్వహించాలని పంచాయితీ కార్యదర్శి వేణుగోపాల్, గణేష్‌లను ఆదేశించారు. సింగిల్ పిట్, డబుల్ పిట్‌లను పరిశ్యలించిన అనంతరం సింగిల్ పిట్ మరుగుదొడ్లు ఉన్నవారు నాలుగేళ్ల అనంతరం వాటిని శుభ్ర పర్చుకోవాలని తెలియజేశారు. అందుకే డబుల్ పిట్ ఉంటే ఒకటి నిండిన తర్వాత మరొక దానికి మార్చి ఉపయోగించుకోవచ్చున్నారు. వీరి వెంట ఇఓఆర్డి పద్మా, రంగరాజు వాలెంటీర్లు ఉన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు మంచి ప్రాధాన్యత

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు మంచి ప్రాధాన్యత కల్పించి కేటాయింపులు చేసిందని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యం.జిలాన్‌బాషా అన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జగనన్న విద్యా దీవెనకు 2,841.64 కోట్ల రూపాయలు, వసతి దీవెనకు 2,200 కోట్లు, విద్యా కానుకకు 650 కోట్లు, అమ్మఒడికి 6,500 కోట్లు, శిధిలావస్థకు చేరుకున్న పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన వసతులు కల్పించడానికి నిర్దేశించిన మనబడి నాడు-నేడుకు 3,500 కోట్ల రూపాయలను కేటాయించడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సీయం జగన్ అహర్నిషలు శ్రమిస్తున్నారని ఆయన మరో 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయన్నారు.

# ఉరవకొండ మండలంలో పప్పుశెనగ కొనగోళ్లు ప్రారంభం

-క్వింటాల్ పప్పుశెనగకు రూ.5,335 మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం



రాయంపల్లి ఆర్బీకే వద్ద పప్పుశెనగ కొనగోలును ప్రారంభించిన దృశ్యం

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** మండలంలో గురువారం పప్పుశెనగ కొనగోళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ పప్పుశెనగకు 5,335 రూపాయలు మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మండల పరిధిలోని రాయంపల్లి రైతు భరోసా కేంద్రంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఉరవకొండ పీఏసీఎస్ ద్వారా పప్పుశెనగ కోనగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సీఈఓ శిలార్ గౌస్ విలేఖరులతో మాట్లాడుతూ గ్రామంలోని ఆర్బీకేలో ఆరుగురు రైతులు పప్పుశెనగ విక్రయానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వారి నుండి కొనగోళ్లు పూర్తీ అయిన తరువాత మరొక ఆర్బీకే పరిధిలో ఇలా మండల వ్యాప్తంగా కొనగోళ్లను చేపడుతామన్నారు. ప్రతిరోజూ 350 క్వింటాళ్ల పప్పుశెనగ కొనగోళ్లను లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది దినేష్, రామాంజినేయులు, ఆర్బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉష తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

-విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని ఎంపీపీ చందా చంద్రమ్మ, సర్పంచ్ మీనుగ లలిత, పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, వైసీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యం.బసవరాజు అన్నారు. పొట్టి శ్రీరాములు 122వ జయంతినిను పురస్కరించుకొని పట్టణంలోని అమరజీవి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నిరాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారని చరిత్ర పుటల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్, వైసీపీ నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, నిర్మలమ్మ, పామిడి జాకీర్, యం.అన్వర్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలతో తహశీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన

-ప్రభుత్వ హామీలన్నీ అమలయ్యే వరకు దశల వారి ఉద్యమం

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు దశలవారి ఉద్యమంలో భాగంగా గురువారం పట్టణంలోని మండల రెవిన్యూ కార్యాలయం ముందు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో డిప్యూటీ తహశీల్దార్ టి.గురుప్రసాద్, సీఎస్‌డీటీ డి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 07-03-23న రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచి జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో కలిపి 3,000 కోట్ల రూపాయలను ఈనెలాఖరులోగా వేస్తామని, సమావేశం మినిట్స్ ప్రతిని ఇస్తామని చెప్పడంతో ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యమ కార్యచరణలో కొంత మార్పులు చేయడం జరిగిందన్నారు. 50 రకాల డిమాండ్ల సాధనకై జరుగుతున్న ఉద్యమం ఏప్రిల్ 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మంజుల, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖలోకి తీసుకున్న ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు

-ఇకపై ఆలయ నిర్వహణ గ్రామ ప్రజలు, సేవా సమితి ఆధ్వర్యంలోనే..

-శ్రీ సూర్యనారాయణస్వామి సేవా సమితి ఛైర్మెన్ సి.చిరంజీవి

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ చోళరాజుల కాలం నాటి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంను కొన్ని నెలల క్రితం దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకొంటూ రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులను రాష్ట్ర హైకోర్టు రద్దు చేసిందని శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయ సేవా సమితి ఛైర్మెన్ సి.చిరంజీవి తెలిపారు. గురువారం ఆయన ఉరవకొండలో మీడియాకు కోర్టు ఉత్తర్వులను అందజేశారు. ప్రభుత్వ ఉత్వర్వులను నిలుపుదల చేయాలని తాను కోర్టులో రిట్ పిటీషన్ వేయగా పరిశీలించి విచారణకు స్వీకరించిన కోర్టు ప్రభుత్వం, పిటీషనర్ తరుపున న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం ఈ మేరకు తీర్పు వెలువరించిందన్నారు. ఇకపై ఆలయ నిర్వహణ బాధ్యతలు గ్రామ ప్రజలు, శ్రీ సూర్యనారాయణస్వామి సేవా సమితి చూసుకొంటుందన్నారు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో జరుగాల్సిన పుష్కరోత్సవం ఎన్నో కారణాలవల్ల జరుగలేదని ఇది మంచిది కాదన్నారు. పుష్కరోత్సవాలను గ్రామ ప్రజలు, సేవా సమితి, కాశీభట్ల అనంతరామశర్మ ఆధ్వర్యంలో వచ్చేనెల ఏప్రిల్‌లో జరుపుకోవాలని గ్రామ ప్రజలు తీర్మానించుకోవడం జరిగిందన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా హైకోర్టు తీర్పు వెలువరించడంతో గ్రామ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని సేవా సమితి ఛైర్మెన్ సి.చిరంజీవి పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా అమరజీవి జయంతి

-చిత్రపటానికి నివాళులర్పించిన ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు



అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ తదితరులు

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర ్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మద్రాసు నుండి తెలుగుజాతిని వేరుచేయాలని తెలుగువారికి ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచారని ఆయన త్యాగం అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ యియియి విభాగాధిపతి వై.సురేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.వెంకటేష్‌నాయక్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎన్.సులోచన తదితరులు పాల్గొన్నారు.

# అశ్వవాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు

**యల్లనూరు, మార్చి 16 ప్రభాతవార్త**



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటరమణ స్వామిని అశ్వవాహనంపై అలంకరించిన దృశ్యం

మండల కేంద్రంలో కోటవీధిలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై వుంచి మెయిన్‌బజార్, కోటవీధిలో అంగరంగవైభంగా మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ఫయాజ్‌బాష ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న ఫయాజ్‌బాష

**తాడిపత్రిఅర్బన్, మార్చి 16 ప్రభాతవార్త**

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మాబుపీరా అనే వ్యక్తి చికిత్స కోసం ఫయాజ్‌బాష ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ ఛైర్మన్ ఫయాజ్‌బాష 20 వేల రూపాయలను బాధితుని చిన్నకుమార్తెకు స్థానిక కార్యాలయంలో గురువారం అందచేశారు. వివరాలు ఇలా వున్నాయి. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన మాబుపీరా గత రెండు సంవత్సరాల క్రితం మూత్రాశయ క్యాన్సర్ బారినపడ్డారు. వైద్యం కోసం ఇప్పటికే చాలా వరకు ఖర్చు అవడంతో నిస్సహాయస్థితిలో ఆర్థిక ంగా తీవ్ర ఇబ్బందుల్లో వున్న మాబుపీరా పరిస్థితి వైసిపి నాయకులు ఫయాజ్‌బాష దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వారి ఆర్థిక పరిస్థితి చూసి చలించిపోయి మాబుపీరా వైద్యఖర్చుల కోసం ఆయన చిన్నకుమార్తె సాదికినీకి 20 వేల రూపాయలను ఫయాజ్‌బాష అందచేశారు. దీంతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా తరుపున ఫయాజ్‌బాషకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మైదుకూరు ఆంజనేయులు, గురుప్రసాద్‌రెడ్డి, వైఎం బాష, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# క్యూ స్పైడర్స్ కంపెనీకి టెక్ విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

**తాడిపత్రిరూరల్, మార్చి 16 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో క్యూ స్పైడర్స్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కంపెనీవారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 3 లక్షల రూపాయలు వుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇవి సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ భానుప్రసాద్, కరస్పాండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, ట్రయిసింగ్ అండ్ ప్లేస్‌మెంట్ బృందం అభినందించారు.

# ఆడపిల్ల చదువు అవనికి వెలుగు - ఆర్డీటి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 16 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కొనరోడ్డులో ఆర్డీటి కార్యాలయ భవనంలో గురువారం ఆర్డీటి ఎటిఎల్ రామాంజినేయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను మమేకం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానహారంగా ఏర్పడి అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను తెలియచేశారు. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అని ఇంటికి దీపం ఇల్లాలు అనే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళలకు, ఆడపిల్లలకు చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియచేస్తూ అనంతరం విలువల గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో ఆర్డీటి సిఇఒ ఆనందు, ఆంజనేయులు, సంఘం సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**యాడికి, మార్చి 16 ప్రభాతవార్త**



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం సమీపంలో వున్న పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని వారు కొనియాడారు. అనంతరం హాజరైన వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తేదేపా మండల కన్వీనర్ రుద్రమనాయుడు, గాదంశెట్టి బాల, శీన, చంద్రశేఖర్, పవన్, వెంకటేష్, విశ్వనాథ్, మద్దాల విశ్వనాథ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**అమడగూరు, మార్చి 15 ప్రభాతవార్త**

మండలంలోని శీతిరెడ్డిపల్లిలో వున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రెండవ రోజు గురువారం సజావుగా జరిగాయి. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు మొత్తం 122 మంది విద్యార్థులకు గాను 118 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటరమణ, అదనపు పర్యవేక్షణ అధికారి విశ్వనాథ్ ఆధ్వర్యంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

06ATP27_06ATP27.qxd 16-03-2023 PM 11:21 Page 1



## కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు ఆరాతీసిన జాయింట్‌డైరెక్టర్



వైద్యసిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న జేడి డాక్టర్ దేవసాగర్

**బత్తలపల్లి, మార్చి 16 ప్రభాతవార్త :** మండలం లో గత 20సంవత్సరాల వ్యవధిలో కుష్టు వ్యాధి గ్రస్తులు, చికిత్స పొందిన వారి వివరాలను రాష్ట్ర కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ దేవప్రసాద్ స్థానిక వైద్యులతో ఆరాతీశారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి గ్రస్తుల వివరాలు, నియంత్రణ వివరాలను డాక్టర్ గంగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాక జనవరి నెలలో జరిగిన ఎల్‌సిడిసి సర్వే గురించి, 20సంవత్సరాల కాలంలో చికిత్సలు పొందిన వారి వివరాలు, కుష్టు వ్యాధితో అంగవైకల్యం బారిన ఎవరైనా పడ్డారా, వారికి ఇవ్వవలసిన చికిత్సలు గూర్చి వివరాలు సేకరించారు. సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా లెప్రసి, టిబి, ఎయిడ్స్ నియంత్రణా అధికారి డాక్టర్ తిప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

### - ఇరువురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నబీరసూల్

**బత్తలపల్లి, మార్చి 16 ప్రభాతవార్త :** మండలకేంద్రానికి సమీంలోని అనంతపురం, కదిరి జాతీయ రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా, ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన నబీరసూల్ ద్విచక్రవాహనంలో జాతీయ రహదారిపై నుండి గంటాపురం వెళ్లేందుకు క్రాస్ అయ్యాడు. అదే సమయంలో బత్తలపల్లి నుండి ముదిగుబ్బ వైపు గల డాబా వద్దకు వెళుతున్న ధర్మవరం పట్టణానికే చెందిన సాయి వెళ్లి ముందు రోడ్డు క్రాస్ అవుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నబీరసూల్ తలకు బలమైన గాయాలైనాయి. సాయికి స్వల్ప గాయాలు కాగా ఇరువురిని స్థానికులు ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. బత్తలపల్లి పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొట్టం దగ్ధం

### -నగదు, బట్టలు, నిత్యవసరాలు కాలిపోయిన వైనం



ప్రమాదంలో కాలిపోయిన వస్తువుల వద్ద బాధిత కుటుంబం

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానిక బాలాజీ సినిమా హాల్ ముందు వైపునగల ఎస్సీ కాలనీలో నివశించే రామాంజి నేయులు అనే వ్యక్తి కొట్టం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధంమైంది. గురువారం తెల్లవారుజామున షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా భయాందోళనకు గురైన బాధిత కుటుంబం బయటకు పరుగులుపెట్టి స్థానికులతో కలిసి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరిగే నష్టం జరిగిపోగా కొట్టంలోని 6వేల రూపాయల నగదుతోపాటు బట్టలు, నిత్యవసర వస్తువులు మొత్తం కాలిపోవడంతో కట్టుబట్టలతో నిలిచారు.

## అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు జరిగే నష్టాన్ని వివరిస్తే అసెంబ్లీ నుండి టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్లు దారుణం

### -విలేఖరుల సమావేశంలో టీడీపీ వజ్రకరూరు మండలం కన్వీనర్ నూతేటి వెంకటేశ్వర్లు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** కర్నాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు పూర్తీ అయితే రాయలసీమకు ఎంతో నష్టం జరుగుతుందని అసెంబ్లీలో ప్రస్తావించి ఈ అంశంపై చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరిన టీడీపీ ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, రామానాయుడును ప్రభుత్వం అసెంబ్లీ నుండి సెషన్స్ ముగిసే వరకు సస్పెండ్ చేయడం అనైతికమని ఈ చర్యలతో రాయలసీమపట్ల ప్రభుత్వానికున్న ప్రేమేంటో స్పష్టమైందని టీడీపీ వజ్రకరూరు మండల కన్వీనర్ నూతేటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాన్నం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పయ్యావుల కేశవ్ అంటే రాష్ట్ర ప్రభుత్వానికి వణుకు పుడుతోందని ఎప్పుడు ఏ ప్రశ్నలు సంధించి ఏ తప్పును ఎత్తిచూపుతారోనన్న భయంతోనే ఆయన్ను అసెంబ్లీలో ఉండకుండా కుట్ర చేస్తున్నారని వాపోయారు. కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం ఆగమేఘాలపై నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 5వేల కోట్ల రూపాయలు కేటాయించినా వై.ఎస్.జగన్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. వైసీపీకు రాయలసీమ జిల్లాల నుండి 49 మంది ఎమ్మెల్యేలు ఉండగా ఈ ప్రాంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఏఒక్కరూ నోరు మెదపకపోగా జగన్‌కు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అప్పర్ భద్రను అడ్డుకోవడానికి జగన్ ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి న్యాయ పోరాటం చేయాలన్నారు. పయ్యావుల కేశవ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చాబాల ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, మూర్తి పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి తండ్రి మృతికి నివాళులు



నివాళులు అర్పిస్తున్న టీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షులు

**అగళి, మార్చి 16 ప్రభాత వార్త :** మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కవితా మల్లేష్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మృతుని పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ధైర్యాన్ని నూరిపోశారు. వీరి వెంట సర్పంచు లింగమ్మ గంగరాజు, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, తెలుగు దేశం మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, మాజీ ఎంపిపి నరసింహయ్య, జడ్పిటిసి ఉమేష్, కార్యదర్శి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రిప్ ఉపయోగంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అగళి, మార్చి 16 ప్రభాతవార్త :** మండలంలో పారగాన్ కంపెనీ రీజనల్ మేనేజర్ సురేందర్‌రెడ్డి, నాగరాజు అనే వారు రైతులు డ్రిప్‌ను ఎలా ఉపయోగించుకోవాలి. దాని నుంచి నీటిని ఎలా ఆదాచేయాలి, దాని వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉంటుంది అన్నదానిపై డ్రిప్ పరికరాలు అందించి రైతులకు అవగాహన కల్పించారు. ఆర్‌బికె ఆఫీసర్ వసంత్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏఓ శేఖర్ నాయక్ ఈ సదస్సును పరిశీలించారు.

## కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు మోసపోకండి

### - కేంద్రమంత్రి నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

**పావగడ, మార్చి 16 ప్రభాతవార్త :** కర్ణాటక రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెబుతూ ప్రజలకు మోసం చేస్తున్నదని వారి మాయమాటలకు మోసపోకండి అని కేంద్ర మంత్రి నారాయణస్వామి విజ్ఞప్తి చేశారు. పావగడలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బిసి మోర్చాల సమావేశంలో



అభిమానులు కలిసి రోడ్స్ నిర్వహిస్తున్న కృష్ణనాయక్

ఎాలగొని మాట్లాడారు. మే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎఇన్నకల్లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. ప్రతి ఇంటికి 2వేల రూపాయలు ఇస్తామంటూ కార్డు పంపిణీ చేస్తున్నారని, ఒక్కొక్కరికి 10 కెజిల బియ్యం ఇస్తామని, ఉచిత విద్యుత్ అంటూ ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిత విద్యుత్ ఎందుకు ఇవ్వలేదని, ప్రతి ఇంటికి 2వేల రూపాయలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇదంతా ఎన్నికల జిమ్మిక్కు కోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎన్నికల్లో పరాజయం పలవుతుందని భారతీయ జనతాపార్టీ అత్యధిక స్థానాలను సాధించి మరోసారి అధికార పగ్గాలను చేపడుతుందని ధీమా వ్యక్త పరిచారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోనే దేశాభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి జరిగిందన్నారు. ప్రత్యేక ఆకర్షణలో కృష్ణనాయక్ ఎస్సీ, ఎస్టీ, ఓబిసి మోర్చాల సమావేశంలో పావగడ నియోజకవర్గం బిజెపి టికెట్ ఆకాంక్షి కృష్ణానాయక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దాదాపు 2వేల మందికి పైగా ఆయన అభిమానులు ప్రత్యేక టీ షర్టును ధరించి పట్టణమంతా తమ నాయకునితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు సెంట్రల్ ఎంపి పిసి మోహన్, జిల్లా బిజెపి అధ్యక్షులు మంజునాథ్, బిజెపి నాయకులు రవిశంకర్‌నాయక్, డాక్టర్ జి.వెంకట్రామయ్య, అశోక్, లాయర్ కృష్ణనాయక్, బ్యాడనూర్ శివ, రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 6వేల మందికిపైగా హాజరయ్యారు.

## చిరుధాన్యాలపై అవగాహన సదస్సు




సమావేశంలో మాట్లాడుతున్న ఏపిఎం ముత్యాలప్ప

**గుడిబండ, మార్చి 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ని ఎస్పిఓ కార్యాల యంలో చిరుధా న్యాల మహోత్స వం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పిజి సభ్యులు, ఎస్పిఓ డైరెక్టర్లు సమావేశమై చిరుధాన్యాల సాగువల్ల ఉపయోగాలు, చిరుధాన్యాలను ఉపయోగించడం వల్ల కలిగే ఆభాలు, చిరుధాన్యాల మార్కెటింగ్, డిమాండ్, తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. తదనంతరం రైతులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ముత్యాలప్ప, ఎఫ్‌పిఓ అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్పిఓ సిసి దేవరాజు, రైతు మిత్ర మక్బూల్, ప్రవీణ్, తదితర ఎఫ్‌పిజి జిసభ్యులు హాజరయ్యారు.

## సచివాలయ భవనాలు పూర్తయ్యేదెన్నడో..

### - మండలంలో పూర్తి అయిన భవనం ఒక్కటే..!




ప్రారంభానికి నోచుకోని నూతన సచివాలయం

**గుడిబండ, మార్చి 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని వైకాపా ప్రభుత్వం చెబుతున్న క్షేత్రస్థాయిలో దానికి తగ్గట్టు సచివాలయ భవనాలను వరుసగా నిర్మించలేకపోతున్నారు. ఈ క్రమంలో మండలంలో ఇంత వరకు సచివాలయం భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. సచివాలయ భవన నిర్మాణంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. అరకొరగా భవనాలు నిర్మించడం బిల్లులు రాలేదంటూ గుత్తేదారులు మధ్యలో ఆపేయడం జరుగుతోంది. గుడిబండ మండలంలో రాళ్లపల్లి గ్రామ పంచాయితీలో ఒకే ఒక్క సచివాలయ భవనం పూర్తయింది. కానీ గుత్తేదారుడు మాకు ఇంకా బిల్లులు రాలేదంటూ నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని అధికారులకు అప్పగించలేదు. ఈ తరుణంలో సచివాలయ భవనం నిర్మాణం పూర్తయినా కూడా ప్రారంభానికి నోచుకోవట్లేదు. దాదాపు 35 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సచివాలయ భవనం వృథా అయ్యిందని, ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన సచివాలయ భవనంలో కార్యకలాపాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



అమరజీవికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త :** పట్టణంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ సర్కిల్‌లో వున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా పెన్షనర్ల కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్ర సాధనకై ఆయన చేసిన త్యాగాలను వక్తలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్‌బాబు, నాయకులు రాజా, చంద్రశేఖర్, లక్ష్మినారాయణ, కాసుల అశోక్, సుదర్శన్, సత్య, సురేష్, మంజునాథ్, పెన్షనర్ల సంఘం నాయకులు అబూబకర్, కుళ్లాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మీ స్థలంలోకి మేము రాం.. మా స్థలంలోకి మీరు రాకండి

### - సత్రాల బావి ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోండి

### - కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



దుకాణా దారులతో మాట్లాడుతున్న కమిషనర్

**పెనుకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** చరిత్ర కలిగిన చత్రాల బావి చుట్టూ ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోండని పెనుకొండ నగర పంచాయితీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. చిత్రాల బావి చుట్టూ ఆక్రమించిన దుకాణాదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్ర ఉన్న బావిని కనుమరుగు చేయడం తగదన్నారు. బావితరాలకు నిదర్శనంగా ఉన్న ఈ బావిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సత్రాల బావిని అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని బావిని సుందరంగా తీర్చి దిద్ది పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకు అందరి సహకారం అవసరమన్నారు. రికార్డుల ప్రకారం మీ స్థలంలో నిర్మాణాలు ఉంటే మేము ఏమి చేయమని ఆక్రమించారని తేలితే నిర్దాక్షిణ్యంగా కూల్చి వేస్తామన్నారు. మీ సంస్థలోకి మేము రాం.. మా సంస్థలోకి మీరు రాకండి అని ఆయన అన్నారు. మే 10వ తేది వరకు మీకు గడువు ఇస్తున్నామని ఆలోపు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని ఆయన వారికి సూచించారు. ఈ సమావేశంలో దుకాణాదారులు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా దొడగట్టమ్మ, కరియమ్మ దేవతల మండల పూజ కార్యక్రమం



దొడగట్టమ్మ, కరియమ్మలకు విశేష పూజలు

**అమరావరం, మార్చి 16 ప్రభాత వార్త :** మండల పరిధిలోని హలుకూరు గ్రామంలో వెలసిన ప్రాచీన కాలం నాటి శ్రీ దొడగట్టమ్మ, కరియమ్మ దేవతలకు గురువారం విశేషా పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవార్ల మూలవిగ్రహానికి ఆలయ అర్చకులు గురుదేవప్ప, దేవాలయ కమిటి అధ్యక్షులు హలుకూరు కాంతరాజు, కార్యదర్శి పేలబండ రామన్నల ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలుతోపాటు హోమాలు నిర్వహించారు. రిటైర్డ్ డిఎస్పీ నాగరాజు యశోధమ్మ దంపతులు దేవతా మూర్తులకు ప్రభావళిని విరాళంగా అందజేశారు. అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణ చేసి పేలబండ గ్రామానికి చెందిన జెల్డేనార్ వంశస్తుల చేత ప్రత్యేక పూజా కార్యక్రమంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ దేవత48వ రోజు నిర్వహించి మరిపూజా కార్యక్రమానిన భక్తులు వందలాధిగా తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విచ్చేసి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాధి హామీ పనులను పర్యవేక్షించి క్యాలిటీ కంట్రోల్ అధికారులు

### - పనుల నాణ్యతపై అధికారులు పర్యవేక్షణ

**అమరాపురం, మార్చి 16 ప్రభాతవార్త :** మండలంలో జాతీయ ఉపాధి హామీ, హేమావతి వాటర్ షెడ్ పథకం కింద జరిగిన మొదటి రెండవ విడత పనుల కోసం నిర్వహించిన సామాజిక తనిఖీలో అభ్యంతరం కలిగిన పనులపై ప్రభుత్వం క్యాలిటి కంట్రోలర్ ఈ. విజయ్‌భాస్కర్, జూనియర్ క్యాలిటి కంట్రోలర్ అధికారి శివారెడ్డిలు అనంతపురం కు విచ్చేసి ప్రత్యేక బృందాల వారీగా ఉపాధి మామీ పథకం పనులు, వాటర్ షెడ్డు పథకం పనులను పరిశీలించి వాటిలో ఉన్న నాణ్యత లోపాలపై క్షుణ్ణంగా పరిశీలన చేయడానికి విచ్చేసారు. అయితే ప్రస్తుతం మహ్మాత్మ గాంధీజాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న ఎంసీసీ వివిధ పనులలో నాణ్యత, రికార్డులు చేయడంపై లోపాల పట్ల స్థానిక సిబ్బందిలోనున్న తేడాలపై సంబంధిత ఉపాధి హామీ అధికారులతో చర్చించినట్లు సమాచారం, ప్రభుత్వం నిరుపేదలకు కూలి పనులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో సంబంధిత ఉపాది హామీ సిబ్బంది, అధికారులకు ఆదేశాలు జారీ చేయడం విధితమే. దీనిపట్ల సంబంధిత సిబ్బంది ఉపాధి పనులు నాణ్యత కొలతలు, రికార్డులను ఏపిఓ ఎండిఅరుణ్‌కుమార్ సమక్షంలో అవగహన కల్పించినట్లు సమాచారం.

## పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

**తాడిమర్రి, మార్చి 16 ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి కృషి చేసిన పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని లైబ్రేరియన్ శీనానాయక్, పేర్కొన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరీ కార్యాలయంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి పాఠకుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది వీర నారప్ప పాటకులు, గ్రంథాలయ అధికారి శీనానాయక్‌లు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వర ఆలయంలో ఆర్య వైష్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతి ఒక్క ఆంధ్రుల మనస్సులో చిరతస్థాయిగా పొట్టి శ్రీరాములు నిలిచిపోయారని ఆర్య వైష్యులు పేర్కొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, మార్చి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని శాఖ గ్రంథాలయం నందు అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జయరాం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి గ్రంథాలయ పాఠకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జయరాం మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్ర సాధన కోసం అమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, హమాత్మాగాంధీ సత్యం, అహింస, హరిజనోద్ధారణ పట్ల ఆకర్షితుడై ఆయన అడుగుజాడల్లో నడిచి జీవితాంతం ప్రజా సేవకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణప్ప, కిష్టప్ప, బాషా, రహంతుల్లా, మహమ్మద్, రామాచారి, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నిందితులు అరెస్ట్

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త :** పట్టణంలోని జంగాలకాలనీలో కులదృవీకరణ వ్యవహారంలో జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన 7 మంది నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు వారాల క్రితం జరిగిన సంఘటనలో జమ్మన్న అనే వ్యక్తి మృతి చెందగా మరో వర్గంలో ఇరువురు గాయపడ్డారు. ఈ సంఘటనలో మారెన్న, నాగప్పతో పాటు మరో 5 మందిని అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పొట్టిశ్రీరాములుకునివాళులర్పించిన ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

**పుట్టపర్తి, మార్చి 16, ప్రభాతవార్త :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు శ్రీసత్య సాయి జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, ఆంధ్రరాష్ట్ర అవతరణకోసం అమరణ నిరాహార దీక్ష చేసి తెలుగువారి ఆత్మ గౌరవానికి త్రీకగా నిలిచారని, మద్రాసు రాష్ట్రం నుండి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పితో పాటు అడిషనల్ ఎస్‌పి కె.వి.రామకృష్ణప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి జడ్.విజయ్‌కుమార్, ఎఓ సుజాత, ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి, ఎఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటాస్, ఆర్ఎస్ఐలు పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**పెనుకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** పెనుకొండ శాఖ గ్రంథాలయమును జిల్లా గ్రంథాలయ సంస్థ కార్దయర్శి రమ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సమరయోధుడు, మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన రఘువీరారెడ్డి



కాంగ్రెస్ నాయకుడిని పరామర్శిస్తు రఘువీరారెడ్డి

**గుడిబండ, మార్చి 16 ప్రభాతవార్త :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఏపిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి గుడిబండ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నాగరాజును పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మందలపల్లి కెనరా బ్యాంకు మేనేజర్ మణికుమార్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగార్జునరెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ రంగనాథప్ప, సురంగల నాగరాజు, బూదిపల్లి నాగభూషణ్, మాజీ ఎంపిటిసి శశిధర్, నాచేపల్లి ఈరన్న, కరియప , షణ్ముఖ, నాగభూషణ్, దొడ్డిరప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మబంధువులుగా అంత్యక్రియలు



భద్రం మృతదేహాన్ని అంత్యక్రియల కొరకు తీసుకెళుతున్న దృశ్యం

**పుట్టపర్తిరూరల్, మార్చి 16, ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ఏలూరు జిల్లా నుండి విచ్చేసి సాయి భక్తుడిగా గత కొన్ని సంవత్సరాలుగా గోకులంలో నివాసముంటున్న ఎం.భద్రం (50) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఇక్కడ ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ వారికి సమాచారం అందించడగా వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు షామీర్, కానిస్టేబుల్ రవి, సాయి, మాతంగి, షాకీర్, చాంద్, సమీవుల్లాలు అక్కడకు చేరుకొని అమృతవాటర్‌మారుతి సహకారంతో వైకుంఠ రథంలో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. తమ సేవలు పూర్తీ ఉచితంగా అందిస్తున్నామని, అవసరమైన వారు ఫోన్ 9603651517 నెంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

**కొత్తచెరువు, మార్చి 16, ప్రభాతవార్త :** ఇంటర్‌మీడియట్ ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 09:00 గంటల నుండి 12:00 గంటల వరకు ఈ పరీక్షలు పకడ్బందీగా సిసి కెమెరాల పర్యవేక్షణలో క్యాలిక్యులేటర్స్, మొబైల్స్ తదితర వస్తువుల అనుమతి లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాటిలో భాగంగా మొదటి రోజు తెలుగు హిందీ, సంస్కృతం, జనరల్ ఫౌండేషన్ కోర్సు సబ్జెక్టుల పరక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు శ్రీసత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 385 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 365 మంది హాజరయ్యారు. మరో 20 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. అలాగే శ్రీ శివసాయి జూనియర్ కళాశాల నందు ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షకు మొదటి రోజు 381 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా, వారిలో 369 మంది పరీక్షకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరాయ్యారని చీఫ్ అబ్జర్వర్ నాగరాజు తెలిపారు. శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ సిటింగ్స్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

## జగనన్న ఇళ్ళను త్వరితగతిన పూర్తీ చేయండి

**కొత్తచెరువు, మార్చి 16, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఇళ్ళను త్వరలోనే పూర్తి చేయాలని డిపిఓ విజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తచెరువు మండల పరిధిలోని తలమర్ల గ్రామ సచివాలయంను గురువారం ఉదయం 10:30 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీఅ ధికారి (డిపిఓ) విజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగుల పనితీరును పంచాయతీ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి సర్పంచ్ రత్నమ్మలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉద్యోగుల హాజరు, వివిధ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తున్నారా? లేదా? సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీకి మంజూరైన జగనన్న కాలనీల్లో ఎన్ని ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ సకాలంలోనే లబ్దిదారులకు అందజేయాలన్నారు.

04ATP16_04ATP16.qxd 16-03-2023 PM 11:18 Page 1



## ఎమ్మెల్సీ ఎన్నికలు కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసేలా అన్ని చర్యలు చేపట్టాం

### - జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

అనంతపురం జెఎన్‌టియులోని ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ, బందోబస్తు చర్యలను జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. స్థానిక జెఎన్‌టియులో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. కౌంటింగ్ ప్రక్రియ కొనసాగేంత వరకు తగు బందోబస్తు ఏర్పాటు చేశాం. అదనపు ఎస్పీ , ఇద్దరు డిఎస్పీలు, నలుగురు సిఐల పర్యవేక్షణలో సుమారు 200 మంది సిబ్బందని బందోబస్తులో ఉంచాం. ఏజెంట్లను చెక్ చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి పంపారు. ఈ పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేస్తున్నాం అన్నారు. జనం గుంపులుగా ఉండ కుండా చర్యలు తీసుకున్నామన్నారు. విజయోత్సవ ర్యాలీలు, ఊరే గింపులు నిర్వహించరాదు. ఓడిపోయిన అభ్యర్థులను అవమాన పరచడం, రెచ్చ గొట్టడం చేయరాదు. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు.



కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

## పొట్టి శ్రీరాములు సేవలు, ప్రాణత్యాగం మరువలేనివి

### - పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల, నివాళులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని అనంతపురం జిల్లా అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఏ.హనుమంతులు సంయుక్తంగా అభిప్రాయపడ్డారు. జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్‌లో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు ప్రాణత్యాగం గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితం అవుదామని అదనపు ఎస్పీలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, ఆర్ ఎస్‌ఐలు రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌నాయక్, పురుషోత్తం, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు

## యోగాతో ఒత్తిడిని జయించి 'పది'లో మంచి ఫలితాలను సాధించండి

### - ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి

పామిడి, మార్చి 16 ప్రభాతవార్త

'పది' పరీక్షల సమయం సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులంతా యోగా చేయటాన్ని అలవర్చుకుని ఒత్తిడిని జయించి ఏకాగ్రతతో విద్యనభ్యశిస్తూ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధిచాలని ప్రభుత్వ ఆయుర్వేధ వైద్యురాలు డాక్టర కృష్ణవేణి పిలుపునిచ్చారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం అయుర్వేధ వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం అన్నారు. విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యను ఏకాగ్రత, క్రమ శిక్షణతో ఆలకించినప్పుడే వారు ఎక్కడైనా విజయాన్ని చేరుకోగలరన్నారు. యోగా చేయటం ద్వార సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అందువల్ల ప్రతి ఒక్కరూ వయసుతో సంబందం లేకుండా యోగా చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని అందువల్ల యోగాలోని ప్రాణాయామం మరికొన్ని ప్రక్రియలను చేయటం ద్వార ఒత్తిడిని ధరికి చేర కుండా చేయవచ్చని తెలిపారు. యోగా శిక్షకురాలు సంధ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక, మానశిక ఒత్తిడిని తగ్గించుకోవటానికి యోగా చేయాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఒత్తిడిని జయించే యోగా ఆసనాలను విద్యార్థినీల చేత చేయిస్తూ ప్రతిరోజూ క్రమం తప్ప కుండా వీటిని చేయాలని కోరారు. అనంతరం విద్యార్థినీలను పరీక్షించిన ప్రభుత్వ ఆయుర్వేధ వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి అవసరమైన ఆయుర్వేధ మందులను అందజేశారు. ఈకార్య క్రమంలో పాఠశాల ఎస్‌ఓ సౌభాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం లక్ష్మి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో యోగాసనాలను చేయిస్తున్న డాక్టర్ కృష్ణవేణి. సంధ్య

## జిల్లా కేంద్ర గ్రంథాలయములో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాల సంస్థ అధ్యక్షులు ఎల్ఎం. ఉమామో హ న్‌రెడ్డి విచ్చేసి ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అధ్యక్షులు మాట్లాడుతూ.. పొట్టి శ్రీరా ములు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి అని మహ్యా పురుషుడు, బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనాడని, మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజ నోదరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన్ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శివశం కర్, గ్రంథాలయ సిబ్బంది కావేరి, బాషా, మల్లికార్జున, ఇతర సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దాం

### - పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకల్లో మేయర్ వసీం

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకు వెళ్దామని నగర మేయర్ మహ్మద్ వసీం పిలుపునిచ్చారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతిని పురస్కరించుకుని నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. పొట్టి శ్రీరా ములు త్యాగం వల్ల మనకు ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. 56 రోజులపాటు ఆమరణ నిరాదాహర దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలిచ్చిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. వారి త్యాగం రాబోయే తరాలకు మార్గదర్శకం కావాలని, ఆ మహనీయుని ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ తదితరులు

## మిద్దెపై నుండి కిందపడి వ్యక్తి మృతి



మృతి చెందిన శివకుమార్

ముదిగుబ్బ, మార్చి 16 ప్రభాతవార్త

మండలంలోని పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన కస్తూరి శివకుమార్ (30) అనే వ్యక్తి మిద్దెపై నుండి కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్నం ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ తన నివాసగృహంపై నిద్రిస్తూ అర్ధరాత్రి సమయంలో మూత్రవిసర్జన కోసం మిద్దెపై వున్న మొరంకట్ట వద్దకు వెళ్లగా అక్కడ వున్న పరకలగడ్డిపై కాలు పెట్టడంతో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. పోలీసులకు సమాచారం అందడంతో మృతి చెందిన శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**ఆర్థిక సాయం చేసిన చిలకం :**

శివకుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ధర్మవరం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్ రెడ్డి హుటావుటిన ఆ గ్రామానికి చేరుకుని శివకుమార్ మృతికి నివాళులు అర్పించి అతని కుటుంబాన్ని ఓదార్చి, ఆ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు.



ఆర్థిక సాయం చేస్తున్న చిలకం

## ది ట్రెల్లిస్ స్కూల్‌కి జాతీయ అవార్డు

### - అనంతపురం జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

విద్యా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అనంతపురంకు చెందిన ది ట్రెల్లిస్ స్కూల్‌కు జాతీయ ఉత్తమ పాఠశాల అవార్డు అందుకుంది అని నేషనల్ కన్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ నాగేశ్వరరావు, సంస్థ దక్షిణ భారతదేశ బాధ్యులు పేరూరు బాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెల 15న బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ప్రపంచ విని యోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును పాఠశాల ప్రతినిధి శ్రీకాంత్ వద్దకు అందజేశారు. ఉత్తమ విద్యా సంస్థల కేటగిరిలో పలు సంస్థలు పోటీ పడగా ఎక్కువ ఆదరణ పొందిన పాఠశాలకుగాను అలాగే విలువలతో కూడిన విద్యను అందిస్తున్న విద్యా సంస్థగా ట్రెల్లిస్ పాఠశాల నిలిచింది. అందువల్ల జూరి సభ్యులు ఎంపిక చేశారు. దీంతో జాతీయ అవార్డు కోసం ఎంపిక కాబడినట్లు తెలిపారు. 2020లో స్థాపించిన ఈ పాఠశాల కరోనా లాంటి ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నిలబడటానికి ఆ సంస్థ వ్యవస్థాపకులు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు నిలుస్తుందని నిర్వాహకులు వెల్లడించారు.



ది ట్రెల్లిస్ స్కూల్‌కి జాతీయ అవార్డును స్వీకరిస్తున్న స్కూల్ సిబ్బంది

## రెండో రోజు ఇంటర్ పరీక్షలకు 632 మంది గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

ఇంటర్మిడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం రెండో రోజు జరిగిన పరీక్షకు 632 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 2978 మంది విద్యార్థులకుగాను 29156 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన విద్యార్థులు 632 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేష్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డీఈసీ మెంబర్లు, హై పవర్ కమిటీ సభ్యులు తెలిపారు.

## రాష్ట్ర పోలీసు శాఖ టెక్నికల్ సర్వీస్ డిఐజి జూమ్ కాన్ఫరెన్స్

అనంతపురం క్రైం, మార్చి 16 ప్రభాతవార్త

రాష్ట్ర పోలీసు శాఖ టెక్నికల్ సర్వీస్ డిఐజి పిహెచ్‌డి రామకృష్ణ గురువారం అన్ని జిల్లా పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీసు స్టేషన్లలో నూతనంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన విషయ మై పలు సూచనలు చేశారు. జిల్లాలో నూతనంగా మంజూరైన సిసి కెమెరాలను 17 పోలీస్‌స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నట్లు అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు తెలిపారు. అదనపు ఎస్పీతోపాటు డిసిఆర్బి విశ్వనాథచౌదరి, కమ్యునికేషన్ సిఐ శ్రీకాంత్, టెక్నికల్ ఎస్సై సుధాకర్‌యావ్, తదితరులు పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా పోలీసులు

## మహిళల అభివృద్ధికి శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి సంస్థ చేయూత - ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్

బళ్లారి, మార్చి16, ప్రభాతవార్త ; అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీక్షేత్ర గ్రామాభివృద్ధి యోజన సంస్థ నగరంలో తాలూకా మహిళా సమావేశాన్ని స్థానిక శ్రీ కొట్టూరేశ్వరస్వామి మఠంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ వై.ఎం. సతీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఆయన శ్రీక్షేత్ర గ్రామాభివృద్ధి యోజన సంస్థ వారు మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో తగు శిక్షణ కల్పించడంతో పాటు వారికి తగినంత రుణాలను అందజేసి వారి అభివృద్ధికి పాటు పడుతుండడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేస్తుండడానికి ధర్మస్థల గ్రామాభివృద్ధి సంస్థ చేయూత నందించి సబలీకరణ దిశగా అభివృద్ధి పథంలో వారిని నడిపిస్తుం యడడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమానికి ధరణి జ్ఞానవికాస కేంద్రంకు చెందిన సావిత్రమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కర్ణాటక గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయం రిజిస్ట్రార్ భాగ్యరేఖ, ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన బి.సి.ట్రస్టు జిల్లా డైరెక్టర్ చంద్రశేఖర్‌శెట్టి, జిల్లా జన జాగృతి వేదిక అధ్య క్షుడు విరుపాక్షప్ప, 12వ వార్డు కార్పొరేటర్ చేతన, సీనియర్ మహిళా న్యాయవాది రమాదేవి, డా.సవిత, సంస్థ కమిటీ సభ్యురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు.



శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన సంస్థ మహిళా సమా వేశాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎం.సతీష్

## కండ్లపల్లిలో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక దాడులు

### - అక్రమంగా నిల్వ ఉంచిన 110 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం పట్టివేత

పామిడి, మార్చి 16 ప్రభాతవార్త

జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధిరారుల ఆకస్మిక దాడుల్లో అక్రమంగా కర్ణాటకకు తరలించేదుకు సిద్ధంగా నిల్వ ఉంచిన 110 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం పట్టుపడ్డ సంఘటన గురువారం వేకువజామున మండల పరిదిలోని కండ్లపల్లి వ్యవసాయ పొలంలో ఉన్నటువంటి ఓ ఇంటిలో చోటుచేసుకుంది. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన బోయ సురేష్ కండ్లపల్లికి చెందిన నాగరాజుకు వ్యవసాయ పొలంలోని ఇంటిని అద్దెకు తీసుకుని కర్ణాటకకు తరలించేందుకు పిడిఎస్ బియ్యంను పెద్దఎత్తున నిల్వ ఉంచాడని రాబడిన సమాచారం మేంకు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ డిఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో సిఐ వెంకటరమణ, ఏఓ వాసుప్రకాష్, సిబ్బంది వెంకటేశ్వరమ్మ, పామిడి సిఎస్ డిటిలు ఆకస్మిక దాడులు చేపట్టి బోయ సురేష్‌ను అదుపులోకి తీసుకుని పిడిఎస్ బియ్యంను స్వాదీనం చేసుకున్నారు. ఇటీవల ఇదే గ్రామంలో రెవెన్యూ అధికారులు పిడిఎస్ బియ్యంను పట్టుకుని గుత్తి స్టాక్‌పాయింట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశ్యం తో ప్రభుత్వ చౌకాదాన్యపు డిపోల ద్వార పిడిఎస్ బియ్యంను సరఫరా చేస్తోంది. కొంతమంది ధళారులు ముఠాగా ఏర్పడి నిరుపేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వారి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన పిడిఎస్ బియ్యంను కర్ణాటక రాష్ట్రంలో అధిక ధరకు బ్లాక్‌మార్కెట్లో విక్రయిస్తూ రూ. లక్షలు ఘడిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలోని పలుచోట్ల దాడులు చేపడుతూ అక్రమంగా తరలు తున్న పిడిఎస్ బియ్యంను పట్టుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం.

**పాళ్యంలోనూ ఓ మహిళ ఇదేతంతు..?**

మండల పరిదిలోని పాళ్యం గ్రామంలో ఓ మహిళ సమీప గ్రామాల్లో నిరుపేదల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న పిడిఎస్ బియ్యంను ఓ ఇంటిలో నిల్వ ఉంచుకుని రాత్రికి రాత్రి ప్రత్యేక వాహనాల ద్వార కర్ణాటక ప్రాంతంకు తరలిస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. సదరు మహిళ కొంత కాలంగా పిడిఎస్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కర్ణాటక ప్రాంతంలో బ్లాక్‌మార్కెట్లో అధిక ధరకు విక్రయించటం ఓ వ్యాపారంగా మలుచుకుందని అందుకు పలువురు నాయకులు, అధికారుల అండదండలు అమెకు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయి. జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే సదరు మహిళ నుండి పెద్దఎత్తున పిడిఎస్ బియ్యం పట్టుపడే అవకాశాలు మెండుగా ఉన్నట్లు గ్రామస్థులు వాఖ్యానిస్తుండటం గమనార్హం.

**పిడిఎస్ బియ్యంను తరలిస్తున్నది కర్నూలు జిల్లా వారే..**

పామిడి పట్టణం రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ చౌకాదా న్యపు డిపోల ద్వార పిడిఎస్ బియ్యంను నిరుపేదల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కర్ణాటక బ్లాక్‌మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్న వారంతా అధికశాతం మంది కర్నూల్ జిల్లాకు చెందిన వారే నన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. పామిడి పట్టణంలో ఇంటింటికి తిరిగి కొనుగోలు చేసిన పిడిఎస్ బియ్యంను జాతీయరహదారిలో నిల్వ ఉంచుకుని లారీలు, బస్సుల్లో కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్న సంఘటనలు కోకొల్లలు. ఇదేక్రమంలో గ్రామాల్లో ఏకంగా ఇళ్ళను అద్దెకు తీసుకుని పిడిఎస్ బియ్యంను పెద్దఎత్తున నిల్వ ఉంచుకుని రాత్రికి రాత్రి ప్రత్యేక వాహనాల ద్వార కర్ణాటక ప్రాంతాలకు తరలి స్తున్నా రంటే వీరి నెట్ వర్క్ ఏపాటిదో అర్థ మవుతోంది. మరి ఇంతటి తతంగాన్ని యథేశ్ఛగా కొన సాగిస్తున్నారంటే వారి వెనుక బలమైన నాయ కుల అండదండలు ఉన్నాయన్న అను మానాలు వ్యక్తమవుతున్నాయి.



అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యంను పట్టుకున్న విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు.

**పక్కాదారి పడుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ**

ప్రజాపంపిణీ వ్యవస్థ పక్కదారి పడుతోందన్నది పలువురి వాధన. సంబందిత అధికారుల పర్యవేక్షణ కొరవడటం కారణంగానే పలుచోట్ల యథేశ్ఛగా పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి. మండలంలో ప్రభుత్వ చౌకాదాన్యపు డిఫోలు ఎన్ని.. వాటి ద్వార కార్డు లబ్దిదారులకు ఎన్ని కిలోల పిడిఎస్ బియ్యం సరఫరా అవుతోంది.. లబ్దిదా రులు పిడిఎస్ బియ్యంను ఎందుకు విక్రయిస్తున్నారు.. పిడిఎస్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కర్ణాటక బ్లాక్‌మార్కెట్లో విక్రయిస్తున్న ఇతర జిల్లాల దళారీలు ఎవరు.. వారు ఎంతమంది.. వారికి ఎవరు సహకరిస్తున్నా రన్న విషయాలపై సంబందిత అధికారయంత్రాంగం దృష్టిని సారించి పిడిఎస్ బియ్యం కర్ణాటకకు అక్రమంగా తరలించే వారికి అడ్డుకట్ట ప్రజాపంపిణీ వ్యవస్థ పక్కాదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనావుందని పలువురు కోరుతున్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగాలు మరవలేనివి

### -ఏఐఎస్ఏ నగర ఇన్‌చార్జ్ మంజునాథ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్ అసోషియేషన్ నగర ఇన్‌చార్ మంజునాథ్ అనంతపురం నగరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. అమరజీవిగా ప్రజల హృద యాలలో నిలిచిపోయినా, నిష్కలమైన వ్యక్తి అని మహాత్మునిచే కీర్తించబడినా అవన్నీ కూడా పొట్టి శ్రీరాములుకి చెందుతాయన్నారు. 1901వ సంవత్సరం మార్చి 16న నెల్లూరులో పొట్టి శ్రీరాములు జన్మించారన్నారు. చిన్ననాటి నుంచే దేశ భక్తిని గుండెలలో నింపుకున్న వ్యక్తి అన్నారు. చిన్ననాడు ఉపాధ్యాయులందరి ముందు ధైర్యంగా, బ్రిటీష్ వారు మన దేశానికి చేస్తున్న అన్యాయాన్ని ఉపన్యాస పోటీలలో వ్యక్త పరిచి పొగడ్తలు విమర్శలు సమాన సాధియిలో అందుకున్న వ్యక్తి అన్నారు. నెల్లూరులో మహాత్మా గాంధీ సత్యగ్రహ విధానంలో 29 రోజులు నిరాహార దీక్ష చేసి హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించారు. మద్రాస్ రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 54 రోజులపాటు నిరాహార దీక్ష చేసి 1952డిసెంబర్ 15న మరణించారన్నారు. ఈయన దీక్ష ఫలితంగా అక్టోబర్ 1, 1953న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. సత్యం, అహింస ఎంతటి గొప్ప లక్ష్యాన్ని అయినా సాధించి పెడ తాయని మరో సారి నిరూపితమైందని అన్నారు. కార్యక్రమంలో సురేష్, భార్గవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఏఐఎస్ఏ సంఘం నాయకులు

## అమ్మఒడి వృద్ధాశ్రమంలో కోలాటం, అన్నదానం

అనంతపురం కల్చరల్, మార్చి 16 ప్రభాతవార్త

ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ అనంతపురం వారి ఆధ్వర్యంలో బి కుందనిక పుట్టిన రోజు సందర్భంగా అమ్మఒడి వృద్ధాశ్రమంలో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవర కొండ కౌసల్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసం గించారు. ఈ సందర్భంగా దేవరకొండ కౌసల్య మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పెద్దలను గౌరవి ంచేలా పిల్లలను తల్లిదండ్రులు తయారు చేయాలన్నారు. చిన్న తనం నుంచి చేర్చుకుంటే వారు పెద్ద య్యాక వారి పిల్లలకు మంచి బుద్దులు చేర్పుతారన్నారు. తల్లిదండ్రులు ఏమైతే నేర్పిస్తారో అదే నేర్చుకుంటారన్నారు. కావున పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్త వహించాలన్నారు. పెద్దలను గౌరవించినప్పుడే ఇలాంటి అనాథ శరణాలయాలు ఉండవన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను పిల్లలకు వివరించాలన్నారు. అనంతరం బి.కుందనిక పుట్టినరోజు వేడుకలను అమ్మఒడి వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలసి కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. తరువాత పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అమ్మఒడి వృద్ధాశ్రమంలో సరుకులు పంపిణీ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా కుందనికతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ యడవల్లి సుబ్రమణ్యం, విఆర్ఓ కరణం శ్రీధర్‌రావు, తేజోవతి, కుందనిక, గీత, శిరీష, స్వామి రావు, సమృద్ధి, ప్రభాకర్, రాధా, లాస్య, ప్రియదర్శిని, దీపిక, కవిత, నిహారిక, ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మఒడి వృద్ధాశ్రమంలో కుందనిక పుట్టిన రోజు వేడుకల దృశ్యం



అమ్మఒడి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఆర్టీసీ ఉద్యోగులకు 25 శాతం వేతనాలు పెంచడం తప్పనిసరి

### - కేఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు హెచ్.ఎ.ఆదిమూర్తి

బళ్లారి, మార్చి16, ప్రభాతవార్త ; కేఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మూల వేతనానికి డీఏ కలిపి పరిష్కృత మూల వేతనానికి 25 శాతం వేతనం పెంచి తీరాలని ఆర్టీసీ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఇందుకు ప్రభుత్వం స్పందించని పక్షంలో మార్చి 21వ తేదీన ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సులు బంద్ చేసి సమ్మెకు దిగుతామని కేఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ బళ్లారి విభాగం అధ్యక్షుడు హెచ్.ఎ.ఆదిమూర్తి తెలిపారు. బళ్లారిలో గురువారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన గత ఐదు సంవత్సరాలుగా ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలు పెంచలేదు. కావునా తాము 25 శాతం వేతనాలు పెంచాలన్న డిమాండ్‌ను ప్రభుత్వంకు పెట్టినట్లు, దీనిపై సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి ఆర్థిక పరిస్థితి చూసి తీర్మానం తీసుకుంటారని పేర్కొన్నారు. మంత్రి శ్రీరాములు పిలిచిన సభ కూడా విఫలమయ్యింది. పది శాతం పెంచుతామని ఆర్టీసీ శాఖ మంత్రి శ్రీరాములు తెలిపారు. బుధవారం రాత్రి ఆర్టీసీ సంస్థ ఎం.డి. అన్బుకుమార్‌తో జరిగిన సభలో 12 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని, ఇందుకు తమ కార్మిక సంఘాలు అంగీకరించేదిలేదని చెప్పారు. ఆర్టీసీ సంస్థ నష్టంలో ఉన్నట్లు, వేతనాలు పెంచక పో వడం సరికాదు, ఈ సంస్థ సేవా రంగానికి చెందిన దని, ప్రభుత్వ సంస్థ ఆర్థిక పరిస్థితి సరిగాలేదని, వేతనాల పెంపుకు ముందుకు రాకపోవడం సరి కాదని చెప్పారు. వేతనాల పెంపుతో పాటు ఏడు డిమాం డ్లను ప్రభుత్వం ముందు ఉంచామని తెలిపారు. శుక్రవా రం నాడు బెంగళూరులో సమ్మెకు సంబంధించి చర్చ జరుగుతుందని, ప్రభుత్వం చర్చలకు పిలిస్తే సమాలోచనలు జరుపుతామని పేర్కొన్నారు. సమ్మె చేయడం మా లక్ష్యం కాదు, అయితే నాలుగు సంవత్సరాలకొకసారి వేత నాలు పెంచాలన్న ఒప్పందం అమలులోకి రావాల్సి ఉంది. కోవిడ్ కారణంగా గత ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదు. అందుకే తాము సమ్మె బాట పట్టామని వివరించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు కాంత య్య, వీకే హీరేమట్, బి.హనుమంతప్ప, ఆర్.శివప్ప, డి.గాదిలింగప్ప, బి.బసవరాజ్, టి.చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న హెచ్.ఎ.ఆదిమూర్తి

## రక్షణ దళం కోసం కియా సిఎసి వాహనాలు

అనంతపురం టౌన్, మార్చి 16 ప్రభాతవార్త

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తయా రీదారులలో ఒకటైన కియా ఇండియా, ఈ రోజు నమోదిత విక్రయదారుగా సిఎస్‌టి కార్య కలాపాల్లోకి ప్రవేశించింది. దేశంలోని రక్షణ సిబ్బందికి మెరుగైన ప్రాప్యతకు కట్టుబడి ఉంది. కంపెనీ ఈ కొత్త ఛానెల్ కింద 100కిపైగా బుకింగ్ లను పొందింది. త్వరలో సోనెట్, కారెన డెలివరీలను దేశ వ్యాప్తంగా తన డీలర్లతో ప్రారంభిం చనుంది. గురు గ్రామో ని ప్రాంటియర్ కియాలో జరిగిన కార్యక్రమంలో, కియా ఇండియా చీఫ్ సేల్స్ బిజినెస్ ఆఫీసర్ మ్యుంగ్-సిక్ సోహ్ సెల్టోస్ కీలను దాని గరి ్వంచదగిన యజమాని మేజర్ జనరల్ వికల్ సాహ్నికి అందజేశారు. కియా ఇండియా చీఫ్ సేల్స్ బిజినెస్ ఆఫీసర్ మిస్టర్ మ్యు ంగ్-సిక్ సోహ్న్ మాట్లాడుతూ.. భారత రక్షణ సిబ్బంది నిజమైన హీరోలు, కియా ఇండియాలో మేము ఈ కొత్త చొరవతో వారికి సేవ చేయగ లగడం గౌరవంగా భావి స్తున్నాము. ఇది మా ప్రయాణంలో మరో మైలురాయి అన్నారు.

## నకిలీ కోగిల బీడీల తయారీపై పోలీసులకు ఫిర్యాదు

కదిరి, మార్చి 16 ప్రభాతవార్త

కదిరి పట్టణంలోని చౌకు వీధిలో కొన్ని సంవత్సరాలుగా కోగిల బీడీలు తయారు చేస్తున్న శిరాజుద్దీన్‌ఖాన్, అతని కుమారుడు షాజహాన్‌లు గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ట్రేడ్ మార్క్ హక్కులతో శిరాజుద్దీన్, షాజహాన్ ఇద్దరు కోగిల బీడీలను తయారు చేస్తున్నారు. అయితే తమ పేరిట ఉన్న ట్రేడ్‌మార్కు హక్కు లను కాలరాసి, మదనపల్లి పట్టణం శ్రీరామగోపాల్‌నాయుడు వీధికి చెందిన వివిఎస్.హరికిరణ్ అనే వ్యక్తి 25లక్షలు విలువ చేసే నకిలీ బీడీలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఢిల్లీకి చెందిన ట్రేడ్ మార్కు లాయర్ల అసోషియేషన్‌కు తెలపగా, వారు మదనపల్లికి వచ్చిన వివిఎస్ హరికిరణ్ ఇంట్లో దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారన్నారు.

## నేడు బళ్లారికి పురందేశ్వరి రాక

### - జిల్లా బీజేపీ మహిళా సమావేశం

బళ్లారి, మార్చి16, ప్రభాతవార్త ; భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారంనాడు బళ్లారికి రాను న్నారు. నగరంలోని బసవభవ న్‌లో ఉదయం 11 గంటలకు జరిగే బీజేపీ మహిళా సమావేశంలో పురందేశ్వరి పాల్గొం టారని స్థానిక ఎమ్మెల్యే గాలి సోమశేఖ ర్‌రెడ్డి తెలిపారు. మహిళా సమావే ానికి ముందు పురందేశ్వరి జిల్లా బీజేపీ కార్యాలయంలో పత్రికాగోష్టిలో పాల్గొం టా రన్నారు. మహిళా సమావేశం అనంతరం ఆమె స్థానిక రాయల్‌పోర్టు హోటల్‌లో కమ్మ సమాజం నాయకుల సభలో సాయంత్రం 4 గంటలకు పాల్గొంటారన్నారు.